## ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

కోటగిరి, డిసెంబర్ 9 : 2024, జనవరి 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ జనవరి 5వ తేదీలోగా ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోటగిరి, పొతంగల్ మండలాల తహసీల్దార్లు ప్రభాకర్, రమేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పు, చేర్పుల కోసం ఈనెల 20 నుంచి జనవరి 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జనవరి 6న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన, జనవరి 8న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న లింబారెడ్డి

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 9 : మండలంలోని మనోహరాబాద్ గ్రామానికి చెందిన రొడ్డ గంగారాం సతీమణి అనారోగ్యంతో బాధపడుతున్నది. వారి ఆర్థిక పరిస్థితి బాగా లేక పోవడంతో గ్రామానికి చెందిన అల్లూరు లింబారెడ్డి శనివారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గంగారాం కుమారుడు ప్రశాంత్‌కు శనివారం నగదును అందజేశారు. కార్యక్రమంలో కుంట ఐలేశ్, బాలయ్య, కుడల గంగారాం పాల్గొన్నారు.

## 14 నుంచి భాగవత సప్తాహం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 9 : జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న రాఘవేంద్రస్వామి మఠంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు శ్రీమత్ భాగవత సప్తాహ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు సతీశ్ ఆచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీంగల్ నంబి వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు సప్తాహ ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. 17న మన్యసూక్త, ఆయుష్య హోమం, 20న భాగవత సప్తాహం ముగింపు కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

## నేడు రూరల్ ఎమ్మెల్యే రాక

ఇందల్వాయి/ డిచ్‌పల్లి, డిసెంబర్ 9 : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా భూపతిరెడ్డి శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసి జిల్లాకు మొదటిసారి ఆదివారం రానున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల అధ్యక్షులు కూరపాటి గంగాధర్, మోత్కురి నవీన్‌గౌడ్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి వద్ద నాయకులు, కార్యకర్తలు భూపతిరెడ్డికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. చంద్రాయన్‌పల్లిలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, ర్యాలీగా ఇందల్వాయి టోల్‌ప్లాజాకు చేరుకుంటారని తెలిపారు. ఇందల్వాయి సాయిబాబా, గన్నారం వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా డిచ్‌పల్లికి చేరుకుంటారని పేర్కొన్నారు.

## 23న వైకుంఠ ఏకాదశి వేడుకలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 9 : మార్గశిర శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని శివాజీనగర్‌లోని శ్రీకృష్ణ గీతాభవనంలో ఈనెల 23న వైకుంఠఏకాదశి వేడుకలు, గీతాజయంతి సందర్భంగా ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గీతా చారిట్రబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శనిశెట్టి కిషన్ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5.30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, 7 గంటలకు ధ్వజారోహణం, విష్ణు సహస్ర నామ పారాయణం, 11 గంటలకు గీతాయజ్ఞం, మధ్యాహ్నం 2 గంటలకు 10వ తరగతిలోపు విద్యార్థులకు 14వ అధ్యాయ భగవద్గీత పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

వర్ని, డిసెంబరు 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని వర్ని మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బస్సులో మహిళలకు ఉచిత టికెట్ ఇచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముత్తారెడ్డి రాజారెడ్డి, నేమాని వీర్రాజు, సురేశ్ బాబు, గంగప్ప, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ ఆధ్వర్యంలో గీతా శ్లోకాల పోటీలు



శ్లోకాల పోటీల్లో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 9 : ఆధునిక జీవిత సంఘర్షణలో నలిగిపోతూ విషాదయోగాన్ని అనుభవిస్తున్న నేటి యువతకు భగవద్గీత చక్కటి కరదీపిక అని, మానవ జీవన సరళిని నియంత్రిస్తూ జీవన గమనానికి సత్యమైన గమ్యాన్ని చూపే గీతామృతం భగవద్గీత అని అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి గౌరవ అధ్యక్షుడు నరేందర్ రావు షిండే అన్నారు. నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న గీతా మందిరంలో టీటీడీ, జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ శ్లోక పోటీలను శనివారం నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని అభ్యాస, శ్రీరామకృష్ణ, నిర్మల హృదయ, ప్రెసిడెన్సీ తదితర పాఠశాలలకు చెందిన 200కు పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా వీపీ చందన్‌రావు, యోగా రాంచంద్రం, కవిత, జానకి, సముద్రాల మాధురి, చంద్రశేఖర్‌శాస్త్రి వ్యవహరించారు. 6, 7, 8 తరగతుల విభాగంలో నవతేజ, వెంకట షణ్ముఖ కులకర్ణి, సాయిసంవేద.. 8, 9, 10 తరగతుల విభాగంలో అనుష్, స్వర్ణ, లాస్య, 19 సంవత్సరాల పైబడిన విభాగంలో మంజీర విజేతలుగా నిలిచారు. శ్లోకాల పోటీల్లో విజేతలకు జిల్లా ఆర్గనైజర్ వేదాంతం సీతారామచంద్రమూర్తి బహుమతులుగా పుస్తకాలను అందజేసి అభినందించారు.

### 20 శ్లోకాలతో..



ముబారక్‌నగర్‌కు చెందిన లలిత– రమేశ్ దంపతుల కుమార్తె బి. స్వతంత్ర పోటీల్లో 3వ అధ్యాయం కర్మయోగంలోని 20 శ్లోకాలు పఠించి ప్రశంసలు పొందింది. ప్రస్తుతం శివాజీనగర్‌లోని రామకృష్ణ విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్నది. ప్రతిరోజూ రెండు శ్లోకాలు కంఠస్థం చేస్తానని చిన్నారి తెలిపింది.

### 30 శ్లోకాలతో..



వినాయక్‌నగర్‌కు చెందిన నీలమల – జగ్జీవన్‌రాం దంపతుల కుమారుడు వెంకట షణ్ముఖ కులకర్ణి 3వ అధ్యాయంలోని 30 శ్లోకాలను, తాత్పర్యాలను ఏకధాటిగా చెప్పి విజేతగా నిలిచాడు. షణ్ముఖ అభ్యాస పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 3 సంవత్సరాల్లో 700 శ్లోకాలను కంఠస్థం చేసి ఆదర్శంగా నిలుస్తానని చెప్పాడు.

### 700 శ్లోకాలతో..



18 ఏండ్లు పైబడిన వారి విభాగంలో 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను స్వరయుక్తంగా పఠించి విజేతగా నిలిచారు గంగస్థాన్‌కు చెందిన మంజీర. ఎంసీఏ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్న మంజీర.. అమ్మనాన్నలు, భర్త హేమంత్ కులకర్ణి సహకారంతో భగవద్గీతను 11 సార్లు మొత్తం చదివి శ్లోకాలను కంఠస్థం చేశానని చెప్పారు. ఉన్నత ఉద్యోగం చేస్తూ గంగస్థాన్‌లోని గణపతి ఆశ్రమాలయంలో పిల్లలు, యువతకు ఉచితంగా భగవద్గీత శ్లోక పఠన తరగతులను నిర్వహిస్తున్నారు.

## లింబాద్రిగుట్టకు పోటెత్తిన భక్తులు



అన్నసత్రంలో భక్తుల సందడి

భీమ్‌గల్, డిసెంబర్ 9 : పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లింబాద్రిగుట్ట లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి భక్తులు శనివారం పోటెత్తారు. కార్తికమాస శనివారం నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో గుట్టకు తరలిరావడంతో స్వామి దర్శనానికి బారులు తీరారు. కాలినడకన గుట్టకు చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో గుట్టపై సందడి నెలకొన్నది. దర్శనం అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

## చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్, డిసెంబర్ 9 : మండలంలోని బోర్గాం(కే) గ్రామ శివారులోని ముసలికుంట చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని చెరువులో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభించిందని, మూడు రోజుల క్రితం చెరువులో పడి ఉంటాడని, మృతుడి వయస్సు సుమారు 58 సంవత్సరాలు ఉంటుందని వెల్లడించారు. తెల్ల గడ్డం, నల్ల ,ఎర్రని చారలు కలిగిన చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాకు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

## నేడు పొతంగల్‌లో అయ్యప్ప సామూహిక పడిపూజ

కోటగిరి, డిసెంబర్ 9 : పొతంగల్ మండలకేంద్రంలోని సాయిబాబా కల్యాణ మండప ఆవరణలో నేడు (ఆదివారం) అయ్యప్ప సామూహిక పడిపూజ నిర్వహించనున్నట్లు గురుస్వాములు రాధాకృష్ణ, సూదం శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి గణపతి పూజ, అయ్యప్పపూజ, అభిషేకాలు, 18 మెట్లకు పడిపూజ తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. వివిధ మండలాల నుంచి అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థినుల ఎంపిక

బాల్కొండ, డిసెంబర్ 9: మండలకేంద్రంలో నిర్వహించనున్న 42వ జూనియర్ ఇంటర్ జిల్లా ఖోఖో పోటీలకు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయానికి చెందిన విద్యార్థినులు మైథిలి, నవ్యశ్రీ, ఆనంది, శ్రీవర్ష ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేకాధికారి భవాని శనివారం తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించనున్న 42వ జూనియర్ ఇంటర్ జిల్లా ఖోఖో పోటీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీలు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పీఈటీ స్రవంతి, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ



కొత్తపల్లిలో అయ్యప్ప పడి చేస్తున్న భక్తులు

కోటగిరి, డిసెంబర్ 9 : మండలంలోని కొత్తపల్లిలో అయ్యప్ప మాలధారులు సామూహిక పడిపూజ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బోధన్ అయ్యప్ప ఆలయ అర్చకుడు సంతోష్ పూజారి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో కొత్తపల్లి గ్రామం మార్మోగింది. అయ్యప్పకు పంచామృతం, అభిషేకాలతో పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురుస్వాములు, అయ్యప్ప మాలధారులను సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు పల్లెంపాటి శివనారాయణ, రాధాకృష్ణ, బీర్కూర్ గంగాధర్, శ్రీనివాసరెడ్డి, సూదం శంకర్, పి.సాయిలు పాల్గొన్నారు.